## క్లుప్తంగా

### టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..



పార్టీలో చేరిన కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ నాయకులు

**జి.సిగడాం:** మండలంలోని వెలగాడ గ్రామంలో టీడీపీకి చెందిన ధర్మవరపు శ్రీనివాసరావు, ధర్మవరపు నర్సింగరావులతోపాటు మరో మూడు కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ తిరుమరెడ్డి గౌరీశంకరరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొల్లా జనార్దనరావు, భూపతి సురేష్‌కుమార్, నాయకులు బాలి అప్పలసూరి, జక్కంపూడి రమణ, ధనుంజయ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

### ఆదిత్యుని సన్నిధిలో ఎన్నికల పరిశీలకుడు సందీప్



సందీప్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సాందీప్‌శర్మ

**అరసవల్లి:** ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సార్వత్రిక ఎన్నికల పరిశీలకులు సందీప్‌కుమార్ శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్. చక్రవర్తులు సాదరంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను ఆయనకు సాందీప్‌శర్మ వివరించారు. ఈయన వెంట జిల్లా నెహ్రూ యువకేంద్ర కో–ఆర్డినేటర్ ఉజ్వల్ పాల్గొన్నారు.

### ప్రయాణాల్లో జాగ్రత్తలు తప్పనిసరి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

**శ్రీకాకుళం అర్బన్:** వేసవి సందర్భంగా ప్రయాణికులు ఎండతీవ్రతకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు అన్నారు. వడదెబ్బ లక్షణాలు–ఎండతీవ్రతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోస్టర్‌ను ఆర్టీసీ అధికారులు శనివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణ సమయంలో వడదెబ్బకు గురికాకుండా మజ్జిగ, మంచినీరు అందుబాటులో ఉండచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఎస్ఎం ఎల్ఎస్ నాయకుడు, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, సుమన్, ఎంపీ రావు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు



షణ్ముఖి విజయకుమార్‌రాజు దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

**శ్రీకాకుళం కల్చరల్:** మహాలక్ష్మీ ఆధ్యాత్మిక సామాజిక సేవా చారిటబుల్ ట్రస్ట్, ప్రముఖ హార్మోనియం కళాకారుడు బి.ఎ.మోహనరావు సంయుక్త ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో శనివారం ప్రదర్శించిన గయోపాఖ్యానం, కురుక్షేత్రం, సత్యహరిశ్చంద్ర (అరణ్యసీను నుంచి) నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు షణ్ముఖి ఆంజనేయరాజు కుమారుడు విజయకుమార్‌రాజు(తణుకు)కు రజిత మకుట బహూకరణ, గాన గంధర్వ బిరుదుతో సత్కారం జరిగింది. బి.ఎ.మోహనరావు దంపతుల వేడుకల సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పౌరాణిక కళాకారుడు పద్మశ్రీ యడ్ల గోపాలరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, ధర్మపురి గౌరీశంకరశాస్త్రి, పాత్రికేయులు నల్లి ధర్మారావు, అడ్వకేట్ బి.వి. రమణ, ఇప్పిలి శంకరశర్మ, ఎస్.శ్రీనివాసరావు, వాసుదేవాచారి, బలివాడ శ్రీనివాసరావు, పి.శ్రీరామకుమార్ పాల్గొన్నారు.

### 29 నుంచి సెమిస్టర్ పరీక్షలు

**ఎచ్చెర్ల క్యాంపస్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29 నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. వర్సిటీలో శనివారం వివరాలు వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29 నుంచి మే 16 వరకు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. రెగ్యులర్‌గా 9129, సప్లిమెంటరీలో 8320 మంది హాజరు కానున్నారు. 4వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు పరీక్షలు ఉంటాయి. రెగ్యులర్ విద్యార్థులు 7100 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 8151 మంది హాజరు కానున్నారు. 62 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 12, 13, 14 తేదీల్లో సెలవులు ఉంటాయని పేర్కొన్నారు.

# రైతులకు ల్యాబ్‌దాయకం!




సోంపేటలో అగ్రిల్యాబ్




**శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):**




ప్రజలకు అన్నం పెట్టే రైతన్నలకు అన్ని విధాలా అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. అందులో భాగంగా వైఎస్సార్ సమగ్ర వ్యవసాయ పరీక్షా ప్రయోగశాలలు (అగ్రిల్యాబ్‌లు) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఎరువులు, పురుగుమందులు నాణ్యతను తెలుసుకునేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను నేరుగా ల్యాబ్‌లకు తీసుకెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో ఏడు నియోజకవర్గస్థాయి ల్యాబ్‌లకు రూ.5.92 కోట్లు, కేంద్రసెంట్రల్ ల్యాబ్‌కు రూ.5.68 కోట్లు కేటాయించి నిర్మాణాలు సైతం పూర్తిచేసి ప్రారంభించారు. ఈ జిల్లా స్థాయి ల్యాబ్‌లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను పరీక్షిస్తారు. నియోజకవర్గ స్థాయి ల్యాబ్‌ల ద్వారా భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువుల్లో నాణ్యత తెలుసుకుంటారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో ల్యాబ్ ఏర్పాటుకు 600 చదరపు గజాలు స్థలం కేటాయించారు. జిల్లా కేంద్ర ల్యాబ్‌ను మాత్రం సుమారు రూ.1.10 ఎకరాల స్థలంలో నిర్మించారు. దీనిని గార మండలం అంపోలు వద్ద ఏర్పాటు చేశారు. పలాస, నరసన్నపేట, ఆమదాలవలసలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో, పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరులో వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం వద్ద, ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలంలోని కొండములగాం పంచాయతీలో, టెక్కలి నియోజకవర్గ కేంద్రం, ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేటలోనూ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

### ఇవీ ప్రయోజనాలు..

- పంట కాలానికి ముందే భూసార పరీక్షలు **చేయించుకుని** ఏ మేరకు ఎరువులు వాడాలో తెలు**సుకోవచ్చు**. దీని వల్ల ఎకరాకు రూ.2 వేలు **నుంచి** 3వేలు వరకు ఆదా అవుతుంది.
- తక్కువ ఖర్చు అధిక దిగుబడులకు భూసార పరీక్షా ప్రయోగశాలలు ఏర్పాటుకు దోహదపడ**తాయి**.
- సూక్ష్మపోషకాలు, ధాతు**మూలాలు** వంటి వాటి నిష్పత్తులను **పరీక్షించి** ఎరువుల వాడవచ్చు.

### నాణ్యత గుర్తించాకే..



విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు అగ్రిల్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి. గతంలో ఏ విత్తనాలు దొరికితే వాటిని వేసి నష్టపోయేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. నాణ్యమైన విత్తనాలు గుర్తించాకే సాగు చేస్తున్నాం.

– గేదెల నాగేశ్వరరావు, రైతు, పాలవలస, పోలాకి మండలం

### పరీక్షలు ఇలా..



ల్యాబ్‌లో విత్తనాలను పరీక్షిస్తూ..

- ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు నమూనా నాణ్యతను రెండు దశల్లో పరీక్షిస్తారు. మార్కెట్‌లోకి విడుదల కాకముందే కంపెనీలు సరఫరా చేసే ఉత్పత్తులను, డీలర్లు అమ్మకం, స్టాక్ పాయింట్లు వద్ద నుంచి నమూనాలు సేకరిస్తారు. వీటిని జిల్లా స్థాయి ల్యాబ్‌లలో పరీక్షించి ప్రమాణాలకు అనుకూలంగా లేనట్లయితే తిరిగి వెనక్కి పంపిస్తారు.
- మార్కెట్‌లోకి వచ్చాక సరుకుల్లో 5శాతం నమూనాలు మళ్లీ పరీక్షిస్తారు. ప్రమాణాలకు లోబడి లేకపోతే సదరు కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలను నేరుగా ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షించుకోవచ్చు. నాణ్యత ప్రమాణాలు లోపిస్తే మండల వ్యవసాయ అధికారి చట్టపరంగా నమూనాలు సేకరించి జిల్లాస్థాయి ల్యాబ్‌కి పంపిస్తారు. .
- ఏకీకృత డిజిటల్ వ్యవస్థలో కంపెనీల ఉత్పత్తులు బ్యాచ్, లాట్‌ల వివరాలు పొందుపరిచి ఆ సమాచారాన్ని సేకరణ బృందానికి అందజేస్తారు. ఈ వ్యవస్థ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు, నమూనా సేకరణ బృందాలు, వ్యవసాయాధికారులు, ల్యాబ్ విశ్లేషకులు, ప్రాంతీయ కోడింగ్ కేంద్రాలు, రైతులు అందరినీ కలుపుతుంది. దీని వల్ల ఏదైనా నమూనా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.

## చెప్పారంటే... చేస్తారంతే

### అమలే కీలకం..



మేనిఫెస్టో ప్రకటించడం కంటే అమలు చేయడం కీలకం. వైఎస్ జగన్ హామీ ఇస్తే అమలు చేస్తారు. 2019లో ఇచ్చిన హామీలు అమలు చేయటం వల్ల ఆయనపై నమ్మకం పెరిగింది. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఆయనది చెరగని ముద్ర. రైతు భరోసా పెంచుతామని ప్రకటించడం సంతోషకరం.

– జి.సహదేవుడు, ఎచ్చెర్ల

### జూనియర్ లాయర్లకు మేలు



న్యాయవాది వృత్తిలో కొత్తగా వచ్చే వారికి ప్రభుత్వం మూడేళ్ల పాటు ప్రతి నెలా రూ.5000 స్టైఫండ్ పథకం కొనసాగిస్తూ మేనిఫెస్టో ప్రకటించడం బాగుంది. న్యాయవాదుల మేలు జరుగుతుంది.

– పిట్టా దామోదరరావు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

### వృత్తిలో నిలదొక్కుకునేందుకు..



న్యాయవాద వృత్తి ప్రారంభంలో ఆర్థిక ఇబ్బందులు ఉంటాయి. ఈ సమయంలో జూనియర్ లాయర్లను ఆదుకోవాలనే ఉద్దేశంతో లా నేస్తం కొనసాగిండచం బాగుంది.

– పొన్నాడ వెంకటరమణారావు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి

### మహిళలకు 'చేయూత'



పేద మహిళలకు చేయూత వంటి పథకాలు మేనిఫెస్టోలో కొనసాగించడం ఆనందంగా ఉంది. ఇలాంటి పథకాలు వల్ల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారు.

– ఎం.దేవిక, వప్పంగి

# ఇంటింటా పథకాలు అందించాం

- ఎన్నికల ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



గార: బూరవెల్లిలో రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

**గార:** ఈ ఐదేళ్లలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అర్హత ఆధారంగానే అందించామని, మరో ఐదేళ్లూ అవినీతి లేని పాలనను అందించేందుకు మీరందరూ మద్దతు పలకాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి, శ్రీకాకుళం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శనివారం గార మండలం బూరవెల్లి, శాలిహుండం, బోరవానిపేట, వాడాడ పంచాయతీల్లో పార్టీ కన్వీనర్ పీస గోపి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పథకాలను అందించామని, వీటిలో ఎవ్వరికైనా రూపాయి లంచం అడగలేని పరిస్థితి కల్పించామన్నారు. రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తిలక్, ధర్మాన ప్రసాదరావులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మార్పు ధర్మారావు, ముంజేటి కృష్ణమూర్తి, పుల్లటి నాగేశ్వరరావు, చల్ల రవికుమార్, మళ్ల నారాయణమూర్తి, సుంకాన సురేష్, నర్సునాయుడు, చిట్టిబాబు, మళ్ల నర్సింహమూర్తి, జల్లు గౌరిపతినాయుడు, చింతల గడ్డెయ్య, బోర రమణయ్య, బోర ఢిల్లీశ్వరరావు, బోర రాజేశ్వరరావు, పుణ్యవతి, కోటేశ్వరరావు, కోనారి చిన్నయ్య, బిన్నాడ తేజ, గురువు అప్పలనాయుడు, చింతనిప్పుల దాసు తదితరులు పాల్గొన్నారు.

**గార:** గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలు అమలుచేసి పేదల పక్షాన నిలిచామని, ఈ ఏన్నికల్లో కూడా గెలిచి పథకాలన్నీ అమలు చేస్తామని చెప్పేందుకు ప్రజల వద్దకు వచ్చామని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో శనివారం గొంటి పంచాయతీలో ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడారు.



గార: గొంటిలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



శ్రీకాకుళం రూరల్: వాకలవాలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ధర్మాన గజలక్ష్మి

కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, శిమ్మ ధర్మరాజు, ఎంపీటీసీ కోట రామారావు, జోగి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం రూరల్:** పేదలకు నిరంతరం సంక్షేమ పథకాలు అందాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. రూరల్ మండలం బలివాడలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశం వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లను గెలిపించాలని కోరారు.

### వడదెబ్బకు గురికావొద్దు

**గార:** ఎండలు తీవ్ర స్థాయిలో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి శ్రీకూర్మంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.



శ్రీకూర్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

### 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై విచారణకు ఆదేశాలు

**అరసవల్లి:** అరసవల్లిలో సంచలనం సృష్టించిన 100 కె.వి. ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారం మళ్లీ తెరపైకొచ్చింది. ఈనెల 27న సాక్షిలో ప్రచురితమైన 'ఆదిత్యనగర్ కాలనీలో విద్యుత్ సమస్య' పేరిట కథనానికి ఈపీడీసీఎల్ కార్పొరేట్ అధికారులు స్పందించారు. కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఎందుకు ఏర్పాటు చేయలేదో విచారణ జరిపి మూడు రోజుల్లోగా నివేదిక పంపించాలని సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తికి ఈపీడీసీఎల్ సీఎస్‌సీ జనరల్ మేనేజర్ శనివారం ఆదేశించారు. డీ–1 ఏఈ కమల్‌హాసన్ నిర్వాకంపై విచారణను శనివారం నుంచే ప్రారంభించారని తెలిసింది.

### సజావుగా పాలిసెట్

**ఎచ్చెర్ల క్యాంపస్:** పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పాలిసెట్ – 2024 ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీకాకుళం, టెక్కలి డివిజన్లు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 38 కేంద్రాల్లో 10858 మంది పరీక్ష రాశారు. సాంకేతిక విద్యాశాఖ పరిశీలకుడు మురళీకృష్ణ, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు పర్యవేక్షించారు.

# చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరు

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** 40 ఏళ్ల అనుభవమున్న చంద్రబాబుకు తెలిసిన సూత్రాలు మోసగించడం, దోచుకోవడం, దాచుకోవడమేనని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 19వ డివిజన్‌లో కొండాల గణేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ సీఎం జగన్ పాలన అందించారన్నారు. జనం మెచ్చే పాలనను చూసి ఓర్వలేని తనంతో చంద్రబాబు అండ్ కో, ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి గాని, జిల్లాకు గాని శాశ్వతంగా ఉపయోగపడిన ఒక్క పని చేయలేదన్నారు. స్టీల్ బెంచీల ఎంపీ రామ్మోహన్‌నాయుడు జిల్లాలో ఒక్క అభివృద్ధి పనైనా చేశారా అని ప్రశ్నించారు. రామ్మోహన్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. మంచి చేసే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీకే ఓటు వేసి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఎమ్మెల్యేగా ధర్మాన ప్రసాదరావును, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, సాధు వైకుంఠరావు, కొమ్ము రమణమూర్తి, రాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వార్డు మెంబర్లు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్

# జగనన్నను గెలిపిద్దాం

**జి.సిగడాం:** రాష్ట్ర వ్యాప్తంగా నగరాల కులస్తులంతా జగనన్న గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని నగరాల రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లా ఆనందరావు పాత్రుడు అన్నారు. శనివారం సేతుభీమవరంలో ఎమ్మెల్యే సతీమణి గొర్లె పరిమళ, ఎంపీపీ మీసాల సత్యవతి ఆధ్వర్యంలో నగరాల కులస్తులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కిరణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పరిమళను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి గురాన మానస, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, బొల్లు జమ్మినాయుడు, బొల్లు రమణ, పైల త్రినాథరావు, పైల నర్సింగరావు, పైల సింహాచలం, ఇప్పిలి త్రినాథరావు పాల్గొన్నారు.



పరిమళను సత్కరిస్తున్న నగరాల కులస్తులు

# వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నివర్గాలకు మేలు



రణస్థలం: మహంతిపాలెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

- ఎన్నికల ప్రచారంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

**రణస్థలం:** నవరత్నాలు–2 మేనిఫెస్టోపై అన్ని వర్గాల నుంచి ఆనందం వెల్లివిరుస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం కృష్ణాపురం, మహంతిపాలెం పంచాయతీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాత పార్టీ కాబట్టే మేనిఫెస్టోలో పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతమిచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలకు మేలు చేసే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మహంతిపాలెం, కృష్ణాపురం సర్పంచ్‌లు గొర్లె అప్పలనర్సు నాయుడు, కంబపు రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, ఎంపీటీసీల సంఘ మండల అధ్యక్షుడు చినరామినాయుడు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు డి.రామారావు పాల్గొన్నారు.

**రణస్థలం:** సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలన ఇంటింటికి రావాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సతీమణి పరిమళ, ఎంపీపీ పిన్నింటి రజిని, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుమారుడు బెల్లాన వంశీకృష్ణ అన్నారు. కొండములగాం పంచాయతీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ వాళ్ల మాయమాటలు నమ్మవద్దని, వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, మహిళ జిల్లా కార్యదర్శి గురాన మానస, గ్రామ సర్పంచ్ గొర్లె మంజూల దేవి, ఎంపీటీసీ రెడ్డి లక్ష్మి, గొర్లె అప్పలనాయుడు, కలిశెట్టి కన్నంనాయుడు పాల్గొన్నారు.



రణస్థలం: కొండములగాంలో మాట్లాడుతున్న గొర్లె పరిమళ, పిన్నింటి రజిని, బెల్లాన వంశీకృష్ణ

### ఎన్నికల విధుల ఉత్తర్వులు తీసుకెళ్లండి:ఆర్ఓ

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలోని పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల విధులు ఉత్తర్వులు తీసుకోవాలని శ్రీకాకుళం ఆర్ఓ సీహెచ్ రంగయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం రూరల్, శ్రీకాకుళం అర్బన్, గార మండలం ఉద్యోగులకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం, వీఆర్వో, ఈఎస్ వద్ద పత్రాలు తీసుకోవచ్చని చెప్పారు. పాఠశాలల సెలవుల నేపథ్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు సహకరించి ఆర్డరు కాపీలు తీసుకోవాలని కోరారు.

### వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

**శ్రీకాకుళం కల్చరల్:** కలెక్టర్ బంగ్లా సమీపంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 14వ వార్షిక తిరుకల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శ్రీకూర్మం దేవస్థానం అర్చకుడు గోపినంబాళ్ల నల్లకూర్మానదాసు పర్యవేక్షణలో అర్చకులు బూరాడ వంశీకృష్ణ అర్చకత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఉత్సమూర్తులను ప్రత్యేక మండపంపై ఉంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదమంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. ముందుగా శోభాయాత్ర నిర్వహించగా, మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, మర్రి యోగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు